

సమస్యల పరిష్కారానికి..

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.

- 8లో ▸



పనిచేసేవారికే పట్టం కట్టాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం నియోజకవర్గంలో పర్యటించి, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /22.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

విచ్చలవిడిగా జూదం!

- దాడులకు వెరవని పేకాటరాయుళ్లు
- అడ్డాలు మార్చి ఆడుతున్న వైనం
- ఏడు నెలల్లో 103 కేసులు నమోదు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పేకాట ఎన్నో జీవితాలను బలితీసుకుంటోంది. సరదాగా మొదలైన ఆట వ్యసనంగా మారడంతో ఎంతో మంది అప్పులపాలై ఆస్తులు అమ్ముకున్నారు. కొందరైతే పొద్దస్తమానం పేక ముక్కలతోనే గడుపుతున్నారు. వ్యాపారం, వివిధ వృత్తుల్లో ఉన్నవారితో పాటు ఉద్యోగస్తులు సైతం అన్ని పనులు పక్కన పెట్టేసి పేకాడుతున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సాగుతున్న పేకాటపై ఎస్పీ రాజేశ్ చంద్ర ఉక్కుపాదం మోపుతున్నా రోజుకో అడ్డాలో ఆట కొనసాగిస్తున్నారు. ఒక్కోసారి సమాచారం తెలిసి పోలీసులు దాడులకు ఉపక్రమించేలోపు పేకాడేవారు అడ్డా మార్చేస్తున్నారు.

జిల్లాలో గతేడాది పేకాటకు సంబంధించి 207 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 1,160 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 40.17 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 103 కేసుల్లో 610 మంది అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి రూ.11.49 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు దాడుల్లో దొరికినప్పటికీ నాలుగు రోజులకే తిరిగి ఆటలో లీనమవుతున్నారు. కొందరు పేకాటలో మునిగి తేలుతూ కుటుంబాలను కూడా పట్టించుకోవడం లేదు. రోజుల తరబడి ఇంటి ముఖం చూడని వారున్నారు.

ఎన్ని అడ్డాలో...

పేకాట ఆడేవారు తమ స్థాయిని బట్టి అడ్డాలు నిర్ణయించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో కొందరు బడాబాబులు పేకాడేందుకు ఇళ్లనే అడ్డాలుగా మార్చుకున్నారు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్తే.. అదే పేకాడ అడ్డా అవుతోంది. అలాగే కొందరు పెంట్ హౌజ్‌లను పేకాట కోసం వాడుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఇళ్లను వ్యాపార కార్యకలాపాల కోసమంటూ అద్దెకు తీసుకుని అందులో పేకాడుతున్నారు. మరికొందరు ఫామ్ హౌజ్‌లను పేకాటకు వాడుకుంటున్నారు. పట్టణ శివార్లలో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన ఇళ్లలో కొందరు పేకాట ఆడుతున్నారు. అలాగే పట్టణానికి చుట్టుపక్కల చెట్లల్లోకి వెళ్లి ఆడేవారున్నారు. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది పొలాల వద్ద పేకాడుతున్నారు. సహజంగా అడవుల్లోకి ఎవరూ వెళ్లరు. దీంతో తమను పట్టుకునేవారు ఉండరనే ఉద్దేశంతో చాలా మంది పేకాడేవారు అడవిబాట పడుతున్నారు. పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించి పేకాటను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రూ. లక్షల్లో నష్టపోతున్నా..

పేకాటకు అలవాటు పడిన వారిలో చాలా మంది రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆటలో నష్టపోయిన సొమ్మును తిరిగి ఆటలోనే సంపాదించాలన్న పట్టుదలతో కొందరు మరిన్ని అప్పులు చేసి ఆడుతున్నారు. రోజుల తరబడి అప్పులు చేసి ఆటలో నష్టపోయి మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముకుంటున్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అప్పులపాలై ఇంటిని అమ్ముకున్నాడు. మరో వ్యక్తి సొంతూరులో ఉన్న వ్యవసాయ భూమిని అమ్మేశాడు. ఇలా ఎంతో మంది ఆటలో నష్టపోయి కుటుంబాలను రోడ్డున పడేశారు. పేకాటలో నష్టపోయి ఆస్తులు కరిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడిన వారూ ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

ఖలీల్‌వాడి : ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో గుర్తింపు కార్డును చూపి ట్రాన్స్‌జెండర్లు ఉచిత ప్రయాణం చేయొచ్చని సంస్థ ఆర్ఎం జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, బాలికలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, బాలికలతోపాటు ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులను కండక్టర్‌కు చూపించాలని, మొబైల్ ఫోన్‌లలో సైతం కార్డులు చూపి ఉచిత ప్రయాణం చేయొచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి పది బస్సులు..



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గానికి పది బస్సులు కేటాయించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ విషయమై ఆయనకు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి.. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి పది బస్సులను కేటాయించాలని ఆర్టీసీ ఎండీకి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఎల్లారెడ్డిలో డిపో ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప్పల్‌వాయి, రంగంపేట రైల్వే గేట్ల మూసివేత

కామారెడ్డి అర్బన్: మరమ్మతుల కారణంగా ఉప్పల్‌వాయి, రంగంపేట రైల్వేగేట్లను 13, 14, 15 తేదీల్లో మూసి ఉంచనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గంలో వెళ్లే ఉప్పల్‌వాయి, రామారెడ్డి, తిర్మన్‌పల్లి, మర్కల్, సదాశివనగర్, రంగంపట, మోషంపూర్, పోసానిపేట గ్రామస్తులు దీనిని గమనించాలని సూచించారు.

ఇంజినీరింగ్ కాలేజీలో ఐదుగురి చేరిక

తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు మూడో విడత కౌన్సెలింగ్‌లో 81 మందిని కేటాయించగా, మొదటిరోజైన సోమవారం ఐదుగురు విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. వీరంతా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి చెందిన విద్యార్థులేనని ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి తెలిపారు. కౌన్సెలింగ్‌లో కేటాయించబడిన మరికొంత మంది విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతి సౌకర్యాలను పరిశీలించారన్నారు. అయితే ఈ విద్యాసంవత్సరం హాస్టల్ వసతి కల్పించకపోవడంతో పలువురు విద్యార్థినులు ఇక్కడ అడ్మిషన్ తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు.

తొలి విద్యార్థి అల్లె శ్రీచరణ్

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి అల్లె శ్రీచరణ్ తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో తొలి విద్యార్థిగా అడ్మిషన్ పొందారు. ఆయనకు ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి స్వాగతం పలికి అడ్మిషన్ అందజేశారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు



బాన్సువాడ : విద్యుత్ సేవలలో ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. సోమవారం బీర్కూర్ విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్ మండలంలో విద్యుత్ సరఫరాలో, విద్యుత్ సమస్యలపై వినియోగదారులు పోస్టు ద్వారా కానీ, వాట్సాప్ ద్వారా కానీ ఫోరమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎలాంటి రుసుము లేకుండా ఫిర్యాదు చేయవచ్చాన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీలతో ఉజ్వల భవిష్యత్తు

- కోర్సులపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లలో ప్రవేశం పొంది ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీలలో అడ్మిషన్ల పెంపుపై కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ ఐటీఐ కోర్సులతో పాటు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లో నైపుణ్య ఆధారిత కోర్సుల అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా కోర్సుల ద్వారా యువత త్వరగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేలా విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శుల ద్వారా స్థానికంగా ఉండే విద్యార్థులకు సమాచారం ఇప్పించాలన్నారు. బిచ్కుంద, తాడ్వాయి, ఎల్లారెడ్డిలలో ఉన్న ఏటీసీలలో చేరడానికి ఈ నెల 28 వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో డీపీవో మురళి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుదాస్, ప్రిన్సిపాల్స్ ప్రమోద్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మహిళా సంఘాలలో చేర్పించాలి

జిల్లాలో మిగిలి ఉన్న వారిని స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కామారెడ్డిలోని కళాభారతి ఆడిటోరియంలో సోమవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో లేనివారిని సంఘాలలో చేర్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 60 ఏళ్లు నిండిన వృద్ధ మహిళల కోసం వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపువారికోసం కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల సంఘాలనూ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్డీవో సురేందర్, అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎంలు శ్రీనివాస్, సాయిలు, సురేష్, శోభ, రాజయ్య, 22 మండలాల ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ ఆస్తుల వివరాలు ఇవ్వాలి

కామారెడ్డి క్రైం: రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్యానెల్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర అన్ని ప్రభుత్వ ఆస్తుల వివరాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యుత్, రెడ్కో శాఖల అధికారులతో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ సిస్టం ద్వారా విద్యుత్ ఉత్పాదనకు చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ భవనాలను, ఆస్తులను సందర్శించి ఆయా సంస్థల భవనాలపై ఎండపడే ప్రాంతాల కొలతలు తీసుకుని, వివరాలను తొందరగా ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు.

భూగర్భ జలాల వృద్ధే లక్ష్యంగా..



సదాశివనగర్‌లో నిర్మిస్తున్న ఫాంపాండ్

- నీటి కుంటల నిర్మాణానికి అధికారుల కృషి
- సదాశివనగర్‌లో జోరుగా నిర్మాణాలు

సదాశివనగర్ : వర్షపు నీరు వృథాగా పోకుండా నీటి కుంటల నిర్మాణానికి అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మాణ పనులు చేపడుతూ భూగర్భ జలాల వృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రత్యేకంగా వ్యవసాయ బోరు బావుల రీచార్జ్ కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నారు. పైభాగం నుంచి వచ్చే వరద నీరు భూమిలో ఇంకిపోయి వర్షాభావ సమయంలో పంట కాలానికి సరిపడా భూగర్భ జలాలు అందే అవకాశాలు ఉంటాయని అవగాహన కల్పిస్తున్నారు. ఫాంపాండ్స్ నిర్మాణంలో జిల్లాలో సదాశివనగర్ మండలం ఆదర్శంగా నిలుస్తోంది.

ఏడు రకాల గుంతలు..

నీటి నిల్వ కోసం వివిధ రకాల ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంత, డ్రైయినేజీ ఇంకుడు గుంత, రాతి కట్టడాల చెక్‌డ్యాములు, అటవీ ప్రాంతాల్లో భారీ నీటి నిల్వ కుంటలను ఏర్పాటు చేస్తున్నారు. సదాశివనగర్ మండలంలో 52 నీటి కుంటల నిర్మాణం లక్ష్యం కాగా 27 నీటి కుంటల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 11 కమ్యూనిటీ నీటి గుంతల్లో ఆరు పూర్తయ్యాయి. 15 వ్యక్తిగత ఇంకుడు గుంతల్లో 10 ప్రారంభ దశలో ఉన్నాయి. గ్రామానికి మూడు చొప్పున డ్రెయినేజీ ఇంకుడు గుంతల ప్రారంభించారు. 40 రాతి కట్టడాల చెక్‌డ్యాములు పూర్తయ్యాయి. 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు ఫాంపాండ్లలో ఒకదాన్ని నిర్మిస్తున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ప్రజలను ప్రోత్సహిస్తున్నాం. ఇంకుడు గుంతల నిర్మాణంతో ఉపాధి కూలీలకు పని దొరుకుతుంది. రైతులు బోరు బావుల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకునేందుకు ముందుకు రావాలి. అందరి కృషితో లక్ష్యాన్ని అధిగమిస్తాం. ఇంకుడు గుంతల నిర్మాణంలో మండలం ఆదర్శంగా నిలవడం గర్వంగా ఉంది.

-సంతోష్‌కుమార్, ఎంపీడీవో, సదాశివనగర్

కొత్త సంఘాల ఏర్పాటు ఎప్పుడో?

- మహిళా సంఘాల్లోంచి 60 ఏళ్లు నిండినవారి తొలగింపు
- వృద్ధులతోపాటు కిశోర బాలికలనూ చేర్పించాలన్న సర్కారు
- జిల్లాలో సభ్యత్వం కోసం ఎదురుచూస్తున్న 70 వేల మంది

స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 60 ఏళ్లు నిండినవారితోపాటు కిశోర బాలికలకు సభ్యత్వం ఇస్తామని ప్రకటించింది. అయితే నెలలు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు. దీంతో జిల్లాలో సుమారు 70 వేల మందికి ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎల్లారెడ్డి : సెర్ప్, మెప్మాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాల నుంచి 60 ఏళ్లు నిండినవారిని తొలగిస్తున్నారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలేమైనా ఉంటే వాటి రికవరీ పూర్తయ్యే వరకు సభ్యులుగా ఉంచి తర్వాత సభ్యత్వం రద్దు చేస్తున్నారు. వృద్ధ మహిళలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందించేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదని తెలిసింది. ఈ కారణంతోనే వృద్ధులను మహిళా సంఘాలనుంచి తొలగిస్తున్నట్లు సమాచారం. దీంతో జిల్లాలో వేలాది మంది మహిళలు సభ్యత్వాన్ని కోల్పోయారు. అయితే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధిల నుంచి రుణాలను పొంది స్వయం ఉపాధి పొందుతున్నామని, ఇప్పుడు తమను సంఘాల నుంచి తొలగిస్తే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. తమకు 60 ఏళ్లు లేకున్నా రికార్డులలో పొరపాట్ల వల్ల మహిళా సంఘాలనుంచి తొలగిస్తున్నారని పేర్కొంటున్నారు. కష్టపడి పనిచేసే ఓపిక ఉన్నా సభ్యత్వం రద్దు వల్ల తమ స్వయం ఉపాధి కోసం కావాల్సిన పెట్టుబడి లేక ఊరికే కూర్చోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారికోసం ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేస్తామని గతంలో సర్కారు ప్రకటించింది. ఇటీవల ఇందిరా మహిళా శక్తి మిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వృద్ధులైన మహిళలతోపాటు కిశోర బాలికలకు వేర్వేరుగా ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దీంతో 60 ఏళ్లు దాటిన మహిళల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. అయితే సీఎం ప్రకటన చేసి నెలలు గడుస్తున్నా ప్రక్రియ మాత్రం ముందుకు కదలడం లేదు.



జిల్లాలో 70 వేల మంది..

జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో ప్రస్తుతం 17,243 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 1.75 లక్షల మంది సభ్యులున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న మహిళలు 42,357 మంది, దివ్యాంగ పెన్షన్ పొందుతున్న మహిళలు 15,516 మంది, కిశోర బాలికలు 16 వేల వరకు ఉన్నారు. ఇందులో మహిళా సంఘాల సభ్యత్వానికి అర్హులైనవారి వివరాలు సేకరించాల్సి ఉంది. వీరందరికి సభ్యత్వం ఇవ్వాలనుకుంటే జిల్లాలో అదనంగా 7 వేల వరకు మహిళా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

60 నిండినయని తీసేసిన్రు..



గతంలో డ్వాక్రా సంఘం నుంచి తీసుకున్న అప్పుతో ఏటా కులవృత్తికి సంబంధించిన వలలను కొనుక్కునేటోళ్లం. వాటితో చేపలు పట్టి బతికేటోళ్లం. ఇప్పుడు నాకు 60 ఏళ్లు దాటినయని సంఘంలోంచి తీసేసిన్రు.

– పందిటి పోచవ్వ, సోమార్‌పేట్

కొనసాగించాలి



డ్వాక్రా గ్రూపు నుంచి తీసుకున్న రుణాలను వ్యవసాయానికి పెట్టుబడికి వాడుకునేవాళ్లం. అవి ఎంతన్న ఆసరా అయ్యేవి. వయసు మీద పడడంతో గ్రూపునుంచి తొలగించారు. మహిళా సంఘంలో కొనసాగించాలి.

– క్యాస ఈరవ్వ, సోమార్‌పేట్

త్వరలోనే కొత్త సంఘాల ఏర్పాటు..

60ఏళ్లు దాటిన వారిని స్వయం సహాయక సంఘాలనుంచి తొలగిస్తున్నారు. వారికోసం త్వరలోనే ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాం. వృద్ధులైన మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించే విషయమై కూడా బ్యాంకర్లతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. త్వరలో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేస్తాం.

– సురేందర్, డీఆర్‌డీవో

కల్యాణిలోకి 230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఎల్లారెడ్డిరూరల్ : తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి సోమవారం 230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులు కాగా.. 408.50 అడుగుల నీటిని నిలువ ఉంచుతూ అదనంగా వస్తున్న 230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోను నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లిస్తున్నామని పేర్కొన్నారు.

నిరాశాజనకంగా నిజాంసాగర్

- అలీసాగర్ వరకు 1.3 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పంటలు గట్టెక్కాలంటే మరో నాలుగు తడులు అవసరం
- వెలవెలబోతున్న ప్రాజెక్టు..
- వరుణుడి కరుణపైనే ఆశలు

నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం



నిజాంసాగర్ : ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు వెలవెలబోతోంది. దీంతో ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరుణుడు కరుణిస్తే తప్ప ఆయకట్టు గట్టెక్కే పరిస్థితులు కనిపించడం లేదు.

నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాలువకు ఇరువైపులా మోటార్లు ఏర్పాటు చేసి మరో 15 వేల ఎకరాల వరకు అనధికారికంగా పంటలు పండిస్తున్నారు.

రెండు విడతల్లో 1.58 టీఎంసీలు విడుదల

ఈ సీజన్‌లో నిజాంసాగర్ ఆయకట్టుకు ఇప్పటి వరకు రెండు విడతల్లో 1.58 టీఎంసీల నీటిని విడుదల చేశారు. జూన్ 25 నుంచి జూలై 9 వరకు మొదటి దఫాలో 0.766 టీఎంసీల నీరందించారు. అదేనెలలో 15 నుంచి 23 వరకు రెండో దఫాలో 0.814 టీఎంసీల నీరు విడుదల చేశారు. అయితే వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 1.224 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.203 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీలో 0.9 టీఎంసీ ఉంటుంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురియకపోతే ఆయకట్టు పంటలు గట్టెక్కడం అసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎగువనుంచి ఆశలు అంతంతే..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన సింగూరు ప్రాజెక్టుతో పాటు కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లు ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు హైదరాబాద్ ప్రాంతంతోపాటు మిషన్ భగీరథ గ్రిడ్‌కు తాగు నీటి సరఫరాకు పరిమితం అయ్యింది. సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుతం 20 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అయితే కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు నిరాశాజనకంగా ఉండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. మెదక్ జిల్లాలోని ఘనపురం ఆనకట్టతో పాటు హల్దీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 6,284 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,392.40 అడుగుల (5.203 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

వర్షాలు కురిస్తేనే..

ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ప్రాజెక్టు కింద సాగు చేసిన పంటలు గట్టెక్కాలంటే నాలుగు తడులైనా నీరివ్వాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటితో నాలుగు తడులు ఇవ్వలేం. వర్షాలు కురిసి ఎగువనుంచి వరదలు వస్తేనే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించగలం.

– శ్రీనివాస్, సీఈ, కామారెడ్డి

క్లుప్తంగా

ఓట్ల దొంగతనం ప్రజాస్వామ్యానికి అవమానం



కామారెడ్డి క్రైం: దేశంలో ఎన్నికల కమిషన్ ఓట్ల దొంగతనం చేయడం ప్రజాస్వామ్యానికి అవమానమని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశం ఏర్పాటు చేసి దేశంలో ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో ఆధారాలతో సహా కళ్లకు కట్టినట్టుగా చూపించారన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ కళ్లు తెరిచి ఓటరు జాబితాను సరిదిద్ది, ప్రజాస్వామ్యానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన కార్యక్రమాలు చేపట్టి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు పండ్ల రాజు, గోనె శ్రీనివాస్, గుడుగుల శ్రీనివాస్, పాత శివ కృష్ణమూర్తి, రాజాగౌడ్, ఐరేని సందీప్, పంపరీ లక్ష్మణ్, లక్ష్మీ రాజ్యం, మసూద్, రాంకుమార్ గౌడ్, సర్వర్, జమీల్, సిద్దిక్, సిరాజ్, భాస్కర్, దోమకొండ శ్రీనివాస్, లక్కపత్ని గంగాధర్, కిరణ్, కస్తూరి నరహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ఒకే నిమిషంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల పేర్లు చెప్పడం లాంటి పలు నైపుణ్యాలను ప్రదర్శించారు. కలెక్టర్ వారిని అభినందించి, నోటు పుస్తకాలు, పెన్నులు, బహుమతిగా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సదరు విద్యార్థినులు ఉదయం నుంచి కనిపించక పోవడంతో వార్డెన్ మమత సోమవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఎస్టీ కళాశాల హాస్టల్‌లో ఉండే ఇద్దరు విద్యార్థినులు సోమవారం ఉదయం మరో విద్యార్థినితో కలిసి కాలేజీకి వెళ్లారు. తర్వాత వారు కనిపించక పోవడంతో వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు వారి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సికింద్రాబాద్‌లో ఉన్నట్లు తెలుస్తోందని సీఐ అశోక్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణిలో 63 ఫిర్యాదుల స్వీకరణ



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 63 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ప్రధానంగా భూ సంబంధిత రెవెన్యూ ఫిర్యాదులు, పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారునికి తెలియపర్చాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఎం, ఏపీఎంలపై చర్యలు తీసుకోవాలి

ఐకేపీ డీపీఎం రవీందర్, ఏపీఎం ప్రసన్న కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామ సంఘం సమన్వయకర్త (వీవోఏ) లక్ష్మీ నర్సవ్వ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. తాను చాలా కాలంగా రెడ్డిపేట వీవోఏగా పని చేస్తున్నానని అన్నారు. 2024 అక్టోబర్‌లో రెడ్డిపేట డ్వాక్రా మహిళా సంఘాలలో అక్రమాలు జరిగాయని కొందరు అకారణంగా ఫిర్యాదులు చేయడంతో తనను విధుల నుంచి తొలగించారని తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని సంఘాలలో ఆడిట్ చేయించగా తాను ఎలాంటి తప్పు చేయలేదని తేలిందన్నారు. అయినప్పటికీ సంఘాల తరఫున రూ.80 వేలు స్త్రీనిధి డబ్బులను తన చేత కట్టించారన్నారు. 9 నెలలు దాటినా ఇప్పటికీ లెక్కలు చేయించడం లేదనీ, విధుల్లోకి తీసుకోవడం లేదని వాపోయారు. సంబంధిత డీపీఎం, ఏపీఎంలపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

గురుకులానికి సొంత భవనం నిర్మించాలి

కామారెడ్డి అర్బన్: లింగంపేటకు 2016లో మంజూరైన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు ఐదు ఎకరాల స్థలం కేటాయించినా, ఇప్పటికీ పక్కా భవనం నిర్మించడం లేదని, వెంటనే భవనం నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. లింగంపేటలో పక్కా భవనం లేనందున గత 9 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నడుపుతున్నారన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి లింగంపేటలో భవన నిర్మాణం చేపట్టాలని కోరారు.

డబుల్ ఇళ్లు అర్హులకే ఇవ్వాలి..



అనర్హులను తొలగించి అర్హులైన నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రతినిధులు, నిరుపేదలు సోమవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. వారు మాట్లాడుతూ.. భిక్కనూర్‌లో జరిగిన ఇళ్ల పంపిణీలో అనర్హులు ఉన్నారని ఆరోపించారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

కొత్త టెండర్ విధానాన్ని మార్చాలి..

గురుకుల పాఠశాలలకు నిత్యవసర వస్తువులు సరఫరా కోసం తెచ్చిన కొత్త టెండర్ విధానాన్ని మార్చాలని కాంట్రాక్టర్లు కోరారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. ఇటీవల జరిగిన 2025–26 ఏడాదికిగాను నూతన టెండర్ విధానంలో ప్రభుత్వం అనేక నిబంధనలను కొత్తగా తీసుకువచ్చిందన్నారు. వాటి ప్రకారం వస్తువులు సరఫరా చేస్తే తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కొత్త టెండర్ విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే 4 నెలల పెండింగ్ బిలుల్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేదంటే ఈ నెల 13 నుంచి సప్లయ్ నిలిపివేస్తామన్నారు.



నినాదాలు చేస్తున్న కాంట్రాక్టర్లు

అలుగు పారుతున్న పెద్ద చెరువు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు ఆదివారం సాయంత్రం నుంచి స్వల్పంగా అలుగు పారడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి మండలంలో కురిసిన భారీ వానలకు అక్కడి కుంటలు, చెరువులు నిండి, పెద్దచెరువుకు వరద వచ్చింది. దీంతో కామారెడ్డి చెరువు నిండి అలుగు పారడంతో కింద భాగంలోని మత్తడిలోకి నీరుచేరుతుంది. ఇకపై ఏ కొద్ది వర్షం కురిసినా అలుగుపారి వృథా నీరు ఉగ్రవాయి, ఆరేపల్లి, భవానీపేట, పాల్వంచ వాగు ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి చేరుతుంది. ఈ వాగునీటి ద్వారా ఆయా గ్రామాల పరిధిలో ఇరువైపులా మోటారు పంపులు బిగించి వందల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. వానలను బట్టి దాదాపు రెండు నెలలు అలుగు పారే అవకాశం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.



అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు

పేదల చదువులకు 'విద్యాలక్ష్మి'



మీకు తెలుసా?

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి విద్యాలక్ష్మి' పథకం అమలు చేస్తోంది.

- ఇంజినీరింగ్, వైద్య ఇతర వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదివే విద్యార్థులకు తోడు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.
- పేదల చదువుకు హామీ పత్రాలు అవసరం లేకుండానే తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణం పొందే అవకాశం కల్పిస్తోంది.
- గూగుల్‌లో https://pmvidyalaxmi.co.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, చిరునామా నమోదు చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక సాధారణ విద్యారుణ దరఖాస్తు పత్రం(సీఈఎల్‌ఏఎఫ్) పూర్తి చేయాలి.
- పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాతోపాటు ఆదాయ ధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- అర్హులైన పేదలకు మూడు విభాగాల్లో రుణం మంజూరు అవుతుంది.
- మొదటి విభాగంలో రూ.4లక్షల లోపు, రెండో విభాగంలో రూ.4లక్షల నుంచి 7.5 లక్షలు, మూడో విభాగంలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ రుణం అందిస్తారు.
- దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.4లక్షల లోపు ఉండాలి.

– సదాశివనగర్ (ఎల్లారెడ్డి)

నులి పురుగుల మాత్రలు వేసుకోవాలి

కామారెడ్డి క్రైం: నులి పురుగుల నివారణ కోసం ఏడాదినుంచి 19 ఏళ్లలోపు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోని వారికి ఈనెల 18 న వేయించాలన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి విద్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మాత్రల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్: 1నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసి, చిన్నారులకు వేశారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నివరణ దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఎవరికైనా మాత్రలు రాకుంటే ఈనెల 18న మరో విడతలో అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో స్థానిక పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




భుంపల్లిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది.. రామారెడ్డిలో..



నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



లింగంపేటలో..



రాజంపేట కేజీబీవీలో..



పిట్లంలో..



కొయ్యగుట్టలో..



ఎల్లారెడ్డి మండలంలో..

ఇంటిపై కూలిన భారీ మర్రిచెట్టు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలో సోమవారం రోడ్డు పక్కనే ఉన్న ఇంటిపై భారీ మర్రిచెట్టు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల మెత్తబడడంతో మర్రిచెట్టు నేల వాలినట్లు తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన ఎంకనోళ్ల ఎంకవ్వ ఇల్లు కూలిపోయింది. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

బైక్ పైనుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు



పిట్లం(జుక్కల్): బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మద్దెలచెరువు గ్రామ సమీపంలో పిట్లం–బాన్సువాడ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన యువకుడు బైకుపై పిట్లం నుంచి బాన్సువాడ వైపు వెళ్తుండగా మద్దెల చెరువు సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మూడున్నర తులాల బంగారం చోరీ

మోపాల్: మండలంలోని గుడి తండాకు చెందిన రత్నావత్ గంగా అలియాస్ హారిక ఇంట్లో నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై జాడె సుస్మిత సోమవారం తెలిపారు. గత నెల 27న కుమారుడి జన్మదినం సందర్భంగా బంగారు ఆభరణాలు ధరించారు. తిరిగి ఎప్పటిలాగే బీరువాలో దాచిపెట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా 8న బీరువా తెరిచి చూడగా, బంగారు ఆభరణాలు కన్పించలేదు. ఇంట్లో అంతా వెతికినా లభించకపోవడంతో చోరీకి గురైనట్లు నిర్ధారణకు వచ్చిన హారిక సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

నలుగురికి రెండు రోజుల సాధారణ జైలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. నలుగురు వ్యక్తులకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'డయల్ 100' దుర్వినియోగంపై ఒకరికి జైలు

ధర్పల్లి: డయల్ 100ను దుర్వినియోగం చేసిన ఓ వ్యక్తికి కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌కు చెందిన కేతావత్ పరశురాం తీజ్ పండుగ సందర్భంగా ఇటీవల మండలంలోని డీబీ తండాలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మద్యం సేవించి ఈ నెల 8న డయల్–100కు పలుమార్లు ఫోన్‌చేసి పోలీసుల విధులను దుర్వినియోగం పరిచాడు. దీంతో పోలీసులు పరశురాంపై కేసు నమోదు చేసి సోమవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజులు..

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా తాడ్వాయి మండలం కన్కల్ గ్రామానికి చెందిన కమలాకర్ రెడ్డి, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన విశ్వనాథ్‌లు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

సేవా సంస్థలో చోరీకి యత్నం



ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్ కెనాల్ కట్ట ప్రాంతంలో ఉన్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం దుండగుడు చోరీకి యత్నించాడు. మధ్యాహ్న సమయంలో కార్యాలయ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడేందుకు ప్రయత్నించాడు. ఇందూరు యువత సిబ్బంది కార్యాలయానికి వచ్చేసరికి డోర్స్ తెరిచి ఉన్నాయి. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి మూడో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎస్సై హరిబాబును వివరణ కోరగా చోరీయత్నం జరిగిందని, దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఠాణాలో చేయి కోసుకున్న యువరైతు

- భూ సమస్యను పరిష్కరించాలని ఆత్మహత్యాయత్నం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భూ వివాదాన్ని పరిష్కరించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన సిద్ధిగారి యాదగిరి అనే యువరైతు సోమవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్లేడ్‌తో చేయికోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఎస్సై భార్గవ్‌గౌడ్ వెంటనే యాదగిరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ, అందుకు యాదగిరి సహకరించకపోవడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా యాదరిగి మాట్లాడుతూ తన తండ్రి రాములు గతంలో గ్రామానికి చెందిన కొందరి వద్ద సుమారు రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశాడన్నారు. ధరణి వచ్చిన తర్వాత తమ భూమి గ్రామానికి చెందిన ఇతరుల పేరిట నమోదైందని, ఈ విషయమై పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పతకాలు సాధించిన అథ్లెట్స్‌కు సన్మానం

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్స్, పీఈటీలతో పాటు జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించిన జైపాల్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరాల రత్నాకర్ ఘనంగా సన్మానించారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో జిల్లాలో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ నిర్మిస్తుందన్నారు. అథ్లెటిక్స్‌ని ప్రోత్సహిస్తున్న పాఠశాలల కరస్పాండెంట్లు, తల్లిదండ్రులను అభినందించారు. ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితంగానే అథ్లెటిక్స్‌లో విజయాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు మరింత ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో రాణిస్తారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలి

నిజామాబాద్ సిటీ: బీసీల రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలన్నారు. సామాజికంగా వెనుకబడిన తరగతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్, పదేళ్లుగా అధికారంలో బీజేపీ ప్రభుత్వం జనాభాకనుగుణంగా కులగణన చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రమేశ్ బాబు, నూర్జహాన్, వెంకటేశ్, నన్నేసాబ్, గంగాధర్, బెజుగం సుజాత, జంగం గంగాధర్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐపై అవగాహన పెంచుకోవాలి'

రామారెడ్డి: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని, దానిపై విద్యార్థులు ఇప్పటినుంచే అవగాహన పెంచుకోవాలని డీఈవో రాజు సూచించారు. రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఏఐపై విద్యార్థులకు అవగాహన కల్పించామని ఎంఈవో ఆనంద్‌రావు డీఈవోతో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపాల్‌రావు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నడీ ఈవో రాజు

భార్యతో ఫోన్ మాట్లాడుతూ భర్త ఆత్మహత్య

- కాపురానికి రావట్లేదని మనస్తాపంతో..

మద్నూర్(జుక్కల్): 'ఎన్ని నెలలైంది నువ్వు ఇక్కడికి వస్తలేవు.. నిన్ను అన్ని రకాలుగా బాగా చూసుకుంటాను. ప్లీజ్ వచ్చేయ్' అంటూ భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉరేసుకొని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్నూర్ మండలం మేనూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై విజయ్ కొండ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేనూర్‌కి చెందిన సాబ్లె సాయిలు(31)కు నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని చైన్‌పూర్ గ్రామానికి చెందిన శోభతో వివాహమైంది. మనస్పర్థలతో ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన శోభ తిరిగి రాలేదు. ఈ క్రమంలో సోమవారం శోభకు సాయిలు ఫోన్ చేశాడు. కాపురానికి రావాలని బ్రతిమిలాడాడు. తర్వాత ఏమైందో తెలియదు కానీ ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. తల్లి సరుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..



నరేశ్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామానికి చెందిన కైరి నరేశ్(39) మద్యానికి బానిసై తన భార్యతో గొడవ పడి మూడు నెలల క్రితం ఫత్తేపూర్ గ్రామానికి వచ్చాడు. అక్కడే ఉంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగించాడు. సోమవారం జీవితంపై విరక్తితో గుళికల మందు తాగి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి కైరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్: వ్యవసాయ భూమి దున్నడంతోపాటు ఆపాలని చెప్పినందుకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాడె సుస్మిత సోమవారం తెలిపారు. మంచిప్ప గ్రామశివారులో అమ్ముల శ్రావణ్ వ్యవసాయ భూమికి కొద్ది దూరంలో తలారి సాయన్న భూమి ఉంది. గత నెల 21న తన భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతున్న తలారి సాయన్నను ఆపాలని శ్రావణ్ కోరాడు. దున్నడం ఆపకపోగా సాయన్నతోపాటు ఆయన కుమారుడు నిఖిల్, అల్లుడు మనోహర్ కలిసి శ్రావణ్‌పై పిడిగుద్దులతో దాడి చేశారు. నిఖిల్ రాడ్‌తో తలపై కొట్టాడు. గాయాలపాలైన శ్రావణ్ 15రోజులకుపైగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అంతేగాకుండా తలారి సాయన్న కుటుంబీకులు శోభ, లక్ష్మి కలిసి శ్రావణ్ తల్లిని విపరీతంగా కొట్టారు. సోమవారం శ్రావణ్ ఫిర్యాదు మేరకు సాయన్న, నిఖిల్, మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.